క్లుప్తంగా

పుట్ట పెద్దమ్మ ఆలయాభివృద్ధికి రూ. 50 వేలు విరాళం

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మ ఆలయాభివృద్ధికి ముసలాయిచెర్వు గ్రామానికి చెందిన వెంకట రామిరెడ్డి రూ. 50వేలు విరాళం అందజేసినట్లు ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా దాతకు అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అంజేశారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

డోన్ టౌన్ : ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఓపెన్ డే సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా, బాలసాయి ఏపీఆర్‌జేసీ తదితర జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న వసతులు, సౌకర్యాలను చూపిస్తు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

దీర్ఘకాలిక సెలవుపై కొత్తకోట సర్పంచ్

డోన్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులపై వెళ్లేందుకు ఎంపీడీఓ శ్రీనివాసులు అనుమతికి మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట వడ్డె నాగరాజుతో కలిసి సుదర్శన్‌రెడ్డి ఎంపిడిఓకు దరఖాస్తును అందజేశారు.

బహిరంగవేలంలో ఆలయానికి ఆదాయం

బనగానపల్లె రూరల్ : ప్రముఖశైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్వాహణ హక్కు లైసెన్స్‌కు సంబంధించి నిర్వహించిన బహిరంగవేలంలో ఆలయానికి రూ.5 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వేలం పాటలో మొత్తం ఎనిమిది మంది పాటదారులు పాల్గొనగా యాగంటిపల్లె గ్రామానికి చెందిన రామనాథ్‌రెడ్డి అత్యధికంగా రూ.5లక్షలకు పాటపాడి వేలాన్ని దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఆలయ పర్యవేక్షణాధికారి నాగప్రసాద్, ఆలయ కమిటి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రతిభ



బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంజామల: మండల కేంద్రం సంజామల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయుడు బాషా జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటాడు. ఈ నెల 12 నుంచి 18 వరుకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ 40 ప్లస్ పురుషుల విభాగంలో హైజంప్‌లో నాలగవ స్థానం, జావలిన్‌త్రోలో ఐదవ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన బాషాను హెచ్‌ఎం శంకర్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత



కుర్చీలు అందజేస్తున్న పూర్వవిద్యార్థి రామేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థి రామేశ్వరరెడ్డి రూ.15వేలు విలువ గల కుర్చీలను మంగళవారం హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డికి అందజేశారు. పూర్వ విద్యార్థి పాఠశాలకు కుర్చీలు విరాళంగా ఇవ్వడంతో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

ఆలయాభివృద్ధికి రూ. లక్ష విరాళం



నగదు అందజేస్తున్న మల్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి మంగళవారం పట్టణానికి చెందిన మల్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రూ. విరాళం ఇచ్చారు. దాతకు కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, అవినాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



రూ.23.40లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



రూ.21.80లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్

కొత్తపేటకు పట్టణ శోభ!

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు కళకళలాడుతున్నాయి. పట్టణాలతో సమానంగా మౌలిక వసతులు చేకూరడంతో పల్లెల్లో సైతం పట్టణ శోభ సంతరించుకుంటున్నాయి. ప్రత్యేకించి బనగానపల్లె పట్టణాకి కూతవేటు దూరంలో ఉన్న ఇల్లూరు కొత్తపేట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణంలా మెరుస్తుంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది. ఉత్తమ పంచాయతీగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ఇల్లూరుకొత్తపేటలో అభివృద్ధి సైతం ఉత్తమంగానే జరిగింది. గత నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి చేతుల మీదుగా మెమోంటో ప్రశంసా పత్రాన్ని అందుకున్న విషయం తెలిసిందే. దాదాపు 6వేల జనాభా ఉన్న ఇల్లూరు కొత్తపేట గ్రామంలో రూ.3.44 కోట్లు అభివృద్ధి పనులు జరగగా 30 సంక్షేమ పథకాల ద్వారా రూ.39.04 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యింది. అదేవిధంగా వైఎస్సార్ రైతుభరోసా ద్వారా గ్రామంలో 844 మంది రైతులకు రూ.4.39 కోట్లు వారి ఖాతాలో జమ అయినట్లు సమాచారం. గ్రామ సచివాయం, రైతు భరోసా కేంద్రాలతో ఇళ్ల వద్దకే సేవలు అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో హెల్త్ సెంటర్ ఏర్పాటుతో ఇక్కడ ఉన్న వైద్య సిబ్బంది ద్వారా అన్ని రకాల వైద్యసేవలు లభిస్తున్నందున సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరంలేదని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. అదేవిధంగా నూతనంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ఏర్పాటుతో పాటు గతంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు పునరుద్ధరణ పనులు చేపడుతున్నందున వేసవిలోనూ ఏ మాత్రం నీటి సమస్య ఉండదని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రూ.43.60లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం



గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ.43.60లక్షలతో సచివాలయ నిర్మాణం
- రూ.23.40 లక్షలతో రైతుభరోసా కేంద్రం
- రూ. 21.80లక్షలతో హెల్త్ సెంటర్ ఏర్పాటు
- రూ. కోటితో సీసీ రోడ్ల నిర్మాణం

ఇంకా జరుగుతున్న అభివృద్ధి పనులు

- రూ. కోటితో సీసీ రోడ్ల నిర్మాణం పనులు
- రూ.40లక్షలతో కొనసాగుతున్న హెచ్ఆర్ఎస్ ట్యాంకు నిర్మాణం
- రూ.15లక్షలతో పాత ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు పునరుద్ధరణ పనులు

గ్రామంలోనే అన్ని సేవలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని సేవలు స్వగ్రామంలోనే అందుతున్నాయి. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం పల్లెలపై ప్రత్యేక దృష్టి సారించడంతో మౌలిక వసతులు చేకూరాయి. ప్రత్యేకించి సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు అందజేస్తున్న సేవలు అభినందనీయం. సొంత మనుషుల్లా ప్రతి సమాచారాన్ని ఇస్తున్నారు.

– నరసయ్య ఇల్లూరుకొత్తపేట

గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి



బనగానపల్లె పట్టణానికి సమీపంలో ఉన్న మా గ్రామం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు మా గ్రామం కూడా బనగానపల్లె పట్టణంలా కనిపిస్తుంది. గ్రామంలో దాదాపు అన్ని సమస్యలు తీరాయి. మా గ్రామాభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు.

– వెంకటసుబ్బారెడ్డి, ఇల్లూరుకొత్తపేట

ఎమ్మెల్యే కాటసాని సహకారంతోనే అభివృద్ధి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో మా గ్రామం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగింది. తన హయాంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుతో పాటు సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే సహకారంతో గ్రామం అభివృద్ధి చెందినందునే రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక అయ్యింది. ప్రజల తరఫున ఎమ్మెల్యే కాటసానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– జి వెంకటరమణ, సర్పంచ్ ఇల్లూరుకొత్తపేట

ఈ నెల 24 నుంచి ఎమ్మెల్యే పర్యటన

- అభివృద్ధి పనుల ప్రారంభించనున్న కాటసాని

బనగానపల్లె : బనగానపల్లె నియోజవర్గంలో ఈ నెల 24వ తేది నుంచి 27వ తేదీ వరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విస్తృతంగా పర్యటించనున్నారని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 24న సాయంత్రం సంజామల మండలం ముక్కమళ్లలో, 25న బనగానపల్లె మండలం యనకండ్ల, 26న పసుపల, చిన్నరాజుపాళెం,పెద్దరాజుపాళెం గ్రామాల్లో, 27న సంజామల మండల కేంద్రంలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ఆయా కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తిమ్మనాయినపేటలో పది పరీక్షల కేంద్రం

కొలిమిగుండ్ల: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవతో తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాలలో సెంటర్ ఏర్పాటు చేసేలా వారు కృషి చేశారు. మార్చి 18 నుంచి 30 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇటీవల డీఈఓ సుధాకర్‌రెడ్డి తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలకు చేరుకొని వసతులను పరిశీలించారు. విద్యార్థులు పడుతున్న కష్టాలను చూసి సెంటర్ వచ్చేలా చేసిన ఎమ్మెల్యే,జెడ్పీచైర్మన్‌కు ఆయా గ్రామాల విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

డోన్ టౌన్ : డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తృటిలో తప్పింది. మంగళవారం డోన్ ఆర్టీసీ డిపో బస్సు బేతంచెర్ల నుంచి పట్టణంలోని వస్తుండగా కొండపేటలోని చాకిరేవు మిట్ట వద్దకు రాగానే మరమత్తులకు గురైంది. బస్సు వెనక్కి వెళ్తుండడంతో డ్రైవర్ చాకచక్యంగా ఓ ప్రక్కకు తిప్పడంతో ఇంటి వద్ద పార్కు చేసిన స్కార్పియోతో పాటు బైకును ఢీకొని నిలిచి పోయింది. వాహనాలు కొద్దిగా దెబ్బతిన్నాయి.

పత్ర కులస్థులకు ఉచితంగా వంద యూనిట్ల విద్యుత్

- మంత్రి బుగ్గన చొరవతో బీసీ–ఎ (ఎంబీసీ) జాబితాలోకి పత్ర
- హర్షం వ్యక్తం చేస్తున్న చంద్రపల్లి పత్ర సోదరులు

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న పత్ర కులస్తులకు 100 యూనిట్లలోపు విద్యుత్‌ను ట్రాన్స్‌కో అధికారులు ఉచితంగా ఇస్తున్నారు. చంద్రపల్లి, హుసేనాపురం, పీఆర్ పల్లి గ్రామాల్లో దాదాపు 150 పత్ర కుటుంబాలు నివసిస్తున్నాయి. సంచార జీవులైన వీరు ఇదివరకు బీసీడీ జాబితాలో ఉండేవారు. దీంతో వీరికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సబ్సిడీ పథకాలు అందేవి కావు. ఈ సమస్య స్థానిక సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ద్వారా తెలుసుకున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పత్ర సోదరులను బీసీ–ఎలో చేరుస్తూ మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ (ఎంబీసీ) ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు పత్ర కులస్తులకు బీసీ–ఎ లో చేరుస్తూ ఎంబీసీ కులధృవీకరణ సర్టిఫికెట్లు జారీ చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న దివంగత రాజశేఖర్ రెడ్డి పత్ర కులస్థులకు 100 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామానికి చెందిన పత్ర సోదరులకు ప్రస్తుతం 100 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లు 'సున్నా' వస్తోంది. ఆర్థికమంత్రి, సర్పంచ్ చొరవతో దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమైందని పత్ర సంఘం రాష్ట్ర నాయకులు హనుమంతు నాయుడు, శ్రీనివాస్ నాయుడు, ఉప్పలపాటి మద్దేశ్వరయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మంత్రి, సర్పంచ్‌తో పాటు ట్రాన్స్‌కో ఏఈ వినయ్‌కుమార్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఇంకా పత్ర జాబితాలో ఉన్న అందరికీ 100 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని వారు కోరారు.



సంతోషం వ్యక్తం చేస్తున్న పత్ర కులస్థులు

చురుగ్గా గొంద్రవాగు బ్రిడ్జి పనులు

సంజామల: మండల కేంద్ర సంజామలలోని గొంద్రవాగు బ్రిడ్జి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామం నుంచి పేరుసోములకు వెళ్ళే ప్రధాన రహదారిలో గొంద్రవాగు ఉంది. వర్షాకాలం రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారు గ్రామస్తులు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి గొంద్రవాగు బ్రిడ్జి వేయించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన బ్రిడ్జి పనులు వేగంగా సాగుతున్నాయి. ఎన్నోఏళ్లుగా వర్షాకాలం ఇబ్బంది పడుతతున్నాం. సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



సంజామలలో గొంద్రవాగు బ్రిడ్జి పనుల జరుగుతున్న దృశ్యం.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జలదుర్గం వైద్యాధికారిణి నుస్రత్ ఉ జొహర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రోగులను పరీక్షించారు. గ్రామానికి చెందిన 294 మంది వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకున్నారు. డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్‌కు కూడా వైద్య సిబ్బంది కంటి పరీక్ష నిర్వహించారు.



కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

హోటల్‌లో అగ్ని ప్రమాదం

డోన్ టౌన్ : మండలంలోని వెంకటాపురం గ్రామ బస్ స్టేజ్ వద్ద ఉన్న గరక రాముడు చెందిన హోటల్‌లో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు గరక రాముడు తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి హోటల్ యథావిధిగా వ్యాపారా కార్యకలాపాలు ముగించుకుని ఇంటికి వెళ్లారు. తెల్లవారు జామున సిలిండర్ పేలి పెద్ద శబ్ధం రావడంతోపాటు మంటలు వ్యాపించడంతో హోటల్ చుట్టు ప్రక్కలవారు యాజమానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే హోటల్ పూర్తిగా కాలిపోయింది. ఫ్రిజ్, నిత్యావసర సరుకులు, కూల్ డ్రింక్స్‌తో పాటు నిల్వ ఉంచుకున్న రెండు సంచుల కందులు, వంట సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు సోమవారం గ్రామానికి చేరుకుని స్థలాన్ని పరిశీలించి బాధితుడితో మాట్లాడి వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

డాక్టర్ చంద్రశేఖర్ మృతి

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన డాక్టర్ గోనవరం చంద్రశేఖర్(48) మంగళవారం మృతి చెందాడు. పట్టణానికి చెందిన దివంగత సీనియర్ న్యాయవాది బాలకృష్ణ కుమారుడు చంద్రశేఖర్ సంజామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా 2008లో నియమితులయ్యారు. ప్రస్తుతం నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.

మధ్యాహ్నం భోజనం తనిఖీ

బనగానపల్లె రూరల్ : మండలంలోని సాధుకొట్టం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ రవీంద్రారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యతో పాటు హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం పర్వీన్, ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్ఓ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

కోవెలకుంట్ల: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కలుగొట్ల సచివాలయ పరిధిలో సేవా వజ్రకు ఎంపికైన దస్తగిరి, సేవారత్నకు ఎంపికైన కలుగొట్ల, బిజనవేముల, కోవెలకుంట్ల–2, 3,4 సచివాలయాలకు చెందిన రాజేశ్వరి, బాలమద్దిరాజు, రమేష్, సుమలత, శివతో పాటు సేవా మిత్ర పొందిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు వెలకట్టలేనివన్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలంటే వలంటీర్లు మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, ఎంపీడీఓ సయ్యదు న్నీసా, ఈఓపీఆర్‌డీ రాధిక, ఈఓ గోపినాథ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, గుళ్లదూర్తి శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి, వల్లంపాడు రామిరెడ్డి, చిన్నకొప్పెర్ల మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



సేవా వజ్ర, రత్నకు ఎంపికైన వలంటీర్లను సత్కరిస్తున్న ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్, ఇతర ప్రజా ప్రతినిధులు

వలంటీర్లకు సన్మానం అర్.....

అవుకు: మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఎంపీడీఓ అన్నారెడ్డి మల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వలంటీర్లను సన్మానించారు. సేవా వజ్రకు ఎంపికైన అవుకు పట్టణానికి చెందిన పాపులమ్మ, సేవారత్నకు ఎంపికైన పేరి భాస్కర్, అంగడి పద్మావతి, కునుకుంట్ల రామాంజనమ్మ, ఉప్పలపాడుకు చెందిన కళ్యాణి, సుంకేసులకు చెందిన విజయ్‌కుమార్ రెడ్డితోపాటు 230 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఈఓ అశ్విన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి సన్మానం



డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని డోన్ తాలూక వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో డీఎస్పీని శాలువ, పూల మాలతో సత్కరించి సరస్వతిదేవి చిత్ర పటం, మెమొంటో అందజేశారు. డీఎస్పీ సేవలను ఈ సందర్భంగా నాగరాజు గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయ భూముల వేలం పాటలు



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలో వెలసిన మద్దిలేటినరసింహ స్వామి ఆలయానికి సంబంధించి రంగాపురం పరిధిలో ఉన్న 48 ఎకరాలను మూడేళ్లపాటు కౌలు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలంలో రూ.4,13,000 ఆదాయం సమకూరినట్లు ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామ చంద్రుడు తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది రూ.1,88,000 అదనపు ఆదాయం సమకూరినట్లు వారు వెల్లడించారు.

మహిళా టైలర్స్ నూతన కమిటీ ఎన్నిక

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీనగర్‌లో మంగళవారం మహిళా టైలర్స్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షురాలిగా జులేఖాబి, ప్రధాన కార్యదర్శిగా అపర్ణ, కోశాధికారిగా లక్ష్మిదేవి, ఉపాధ్యక్షురాలిగా దౌలాత్‌బీ, సహాయ కార్యదర్శులుగా దస్తగిరమ్మ, షాహినా, సభ్యులుగా జ్యోతి, పద్మావతి, సంధ్య, సుమతిని ఎన్నుకున్నారు.



సమావేశమైన మహిళా టైలర్లు

కంబగిరిస్వామికి పాదయాత్ర

అవుకు: సంజామల మండలం పేరుసోములలోని శ్రీవిష్ణు కంటి క్షేత్రం సద్గురువు శ్రీ రామ్మోహన్ స్వామి అవుకు మీదుగా మంగళవారం మండల పరిధిలో ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మి కంబగిరి స్వామి ఆలయానికి పాదయాత్రగా బయల్దేరారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలనే ఉద్దేశంతో భక్త బృందంతో కలిసి పాదయాత్రగా వెళ్తున్నట్లు ఆయన చెప్పారు. పౌర్ణమి రోజు శ్రీలక్ష్మికంబగిరి స్వామికి ప్రీతిప్రాయమైన రోజు అని, ప్రతి పౌర్ణమి రోజున ఆలయంలో ప్రత్యేక వేడుకలు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



బేతంచెర: భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాల వేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు



డోన్ : గంగమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న గంగపుత్రుల సంఘం సభ్యులు

బేతంచెర్ల : మండలంలో భీష్మ ఏకాదశి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని తెలుగు రంగయ్య స్వగృహంలో భీష్మ ఏకాదశి వేడుకలను గంగపుత్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెలుగు వెంకటరమణ, యల్లయ్య తదిరులు భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాళలు వేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు సాగరిక, చరణ్ రాజు చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు గంగన్న, మద్దిలేటి, రాముడు, మద్దయ్య, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్రీను, పరమేష్ పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

డోన్ : భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణ శివారులోని సున్నపుబట్టీల వద్ద గల గంగమ్మ గుడి ప్రాంగణంలో గంగపుత్రులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగపుత్రుల సంఘం గౌరవాధ్యక్షులు, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ గంగపుత్రులందరూ సంఘటితంగా ఆలయం నిర్మించుకునేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం అధ్యక్షులు బెస్త వెంకటేశ్వర్లు, నాయకులు ప్రజావైద్యశాల మల్లికార్జున, మాధవస్వామి, ప్రవీన్, రవికుమార్, విష్ణు, క్రిష్ణమూర్తి, పానిపూరి మురళి, మల్లికార్జున, చంద్రుడు, అంజి, రామక్రిష్ణ, గిరి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.